


# పని మనిషి

జి. రేణుకాదేవి

సాయంత్రం అయిదు గంట లవుతూనే పని ముగించి, ఫైలు కట్టేసి బయటపడే ఆ ఆఫీస్ ఉద్యోగులు ఆ రోజు ఏదో మీటింగ్ ఉండడంతో ఇంకా అందరూ ఆఫీస్‌లోనే ఉన్నారు. అయిదున్నర అవుతుండగా మీటింగ్ ముగించి అందరూ బయటపడ్డారు.

మీటింగ్‌లో తీసుకున్న ఏవో కొన్ని నిర్ణయాల వల్ల అందరి మొహాలు సంతోషంగా ఉన్నాయి. ఇంకా ఆ విశేషాలతోనే కాసేపు కాలక్షేపం చేయడం కోసం అందరూ క్యాంటీన్ వైపు కదిలారు. కానీ సుధాకర్ మాత్రం వాచీ చూసుకుంటూ వేరే దిశగా కదిలాడు.

"కాసేపు క్యాంటీన్‌లో కూర్చుందాం రాకూడదూ?" అన్నా డో కొలీగ్ సుధాకర్ నుద్దేశించి.

"సారీ! నాకు పనుంది. త్వరగా వెళ్ళాలి" అంటూ వేగంగా స్కూటర్ వైపు నడిచాడు సుధాకర్.

"అత నెందుకు పిలుస్తావోయ్! ఆఫీ సొదిలాక అర క్షణం ఆలస్యం చేయకుండా స్కూట రెక్కుతాడు. అలాంటి దీ రోజు అరగంట ఆలస్యం" అంటూ మరో కామెంట్‌ను, ఆ కామెంటుకు గొల్లుమన్న నవ్వులను పట్టించుకోకుండా స్కూటర్ స్టార్ట్ చేసి వేగంగా పోనిచ్చాడు సుధాకర్.

"వీళ్లకేం అర్థమవుతుంది నా బాధ. అరగంట నుండి నా కోసం ఎదురుచూస్తూ ఉంటుంది లక్ష్మి. నే నింకే మాత్రం ఆలస్యం చేసినా తను వెళ్లిపోతుంది. తను వెళ్లిపోతే అమ్మో!" అనుకున్నాడు.

అరగంటలో ఇల్లు చేరాడు సుధాకర్. గుమ్మం మెట్ల మీద కూర్చుని అసహనంగా ఎదురు చూస్తోంది లక్ష్మి. ఆమెను చూడగానే "హమ్మయ్య! ఉంది. ఇంకా నయం వెళ్లలేదు" అనుకుని కాస్త కుదుట పడ్డాడు. మళ్లీ అంతలోనే తను ఆలస్యంగా వచ్చినందుకు ఏమంటుందోనని మనసులో లాగసాగింది.

"ఏంటి బాబుగారూ! ఇం తాలస్యం చేశారు. గంట నుంచి ఎదురు చూస్తున్నాను. ఇంక చూసీ చూసీ వెళ్లిపోదా మనుకుంటుండగా మీ రొచ్చారు." విసుగ్గా అంది లక్ష్మి

"ఆఫీస్‌లో మీటింగ్ ఉండి ఆలస్యమైంది లక్ష్మి!" సంజాయిషీగా చెప్పాడు త్వర త్వరగా తాళం తీస్తూ సుధాకర్.

"ఇలాగయితే ఎలాగ బాబుగారూ! పొద్దు దగ్గరపడింది. ఇప్పు డెంత పని చేయాలనీ అంట్లు తోమాలా? ఇల్లు తుడవాలా? వంట చేయాలా? ఇన్ని పనులు నే నెప్పుడు చేయాలి? ఇంటి కెప్పుడెళ్లాలి? పొద్దుపోయాక ఇంటి కెళితే నా మొగుడు తంతాడు బాబూ!" కాస్త హెచ్చు స్వరంతోనే పలికింది లక్ష్మి సుధాకర్ వెనకాల ఇంట్లో కొస్తూ.

"నే నేమన్నా కావాలని ఆలస్యంగా వచ్చానా?" అని గట్టిగా చెప్పబోయి అంతలోనే తమాయించుకుని గొంతులోకి సహనాన్ని తెచ్చుకుని "ఆఫీస్‌లో మీటింగ్ మూలానా ఆలస్యమైంది లక్ష్మీ! అంతేగాని కావాలని ఆలస్యం చేశానా చెప్పు. మీటింగ్‌కు తప్పనిసరిగా ఉండాలని రూలాయే. న న్నేం చేయమంటావు" అంటూ బట్టలు మార్చుకునే మిషతో గదిలో కెళ్లాడు అక్కడే ఉంటే ఇంకా ఏమంటుందోనని.

"నిజమే బాబూ! మీ పనులు మీ కుంటాయి. కానీ మా బాధలు మా కుంటాయి కదా! నే నింటికెళ్లి నా మొగుడికి, పిల్లలకి వండిపెట్టాలి కదా! ఆలస్యమైతే ఆకలి కాగలేక పిల్ల లేడుస్తారు. తాగొచ్చే నా మొగుడు తంతాడు. మా ఇల్లేమో మైలు దూరంలో ఉందాయె. అంత దూరం నడుచుకుంటూ వెళ్లేటప్పటికి చీకటి పడుతుంది." వంటింట్లో అదీ ఇదీ సర్దుతూ గుణుస్తూనే ఉంది లక్ష్మి.

బట్టలు మార్చుకుని వంటింట్లోకి వచ్చి "ఇల్లు తుడవద్దులే. అంట్లు తోమి, వంట చేసి వెళ్లు. కూరలు నేనే తరుగుతానులే." కాఫీ పెట్టడం కోసం స్టవ్ అంటిస్తూ చెప్పాడు సుధాకర్.


లక్ష్మి కొంచెం సంతృప్తిపడి అంట్లు తోముతుంటే కాఫీ కలపడంలో నిమగ్నమయ్యాడు సుధాకర్. ఇంట్లో దాదాపు అన్ని పనులు లక్ష్మి చేస్తుంది. కానీ కాఫీ మాత్రం సుధాకర్ కలుపుతాడు. సుధాకర్ చేతి కాఫీ తాగుతూ "ఇన్ని ఇండ్లలో తాగుతాను కానీ మీ చేతి కాఫీ అంత కమ్మగా ఎక్కడా దొరకదు బాబూ!" అని మెచ్చుకుంటుంది లక్ష్మి.

పెద్ద గ్లాసు నిండా లక్ష్మికి కాఫీ పోసి, తను ఓ కప్పులో పోసుకుని తాగి కూరలు తరగసాగాడు సుధాకర్. సుధాకర్ అంట్ల పని పూర్తి చేసిన లక్ష్మి రోజులాగే తాపీగా కాఫీ తాగేసి మరో అరగంటలో వంట పని ముగించి ఉదయంపూట మిగిలిన పదార్థాలేవో పట్టుకుని ఇంటి కెళ్లిపోయింది.

"హమ్మయ్యా! ఈ రోజు గడిచిపోయింది" అని ఊపిరి పీల్చుకున్నాడు సుధాకర్.

*** *** ***

సుధాకర్ బ్రహ్మచారి. గత సంవత్సరమే ఉద్యోగంలో చేరడానికిగాను ఈ ఊరొచ్చి ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఉద్యోగం వచ్చేవరకూ అమ్మ చేతి వంట కమ్మగా తినడం అలవాటయిన అతనికి ఇక్కడ హొటల్ భోజనం సహించలేదు. ఎప్పుడూ వంట గది చూడని వాడవడం వల్ల స్వయంపాకం చేసుకునే ప్రయత్నంలో ఘోరంగా విఫలమయ్యాడు. అందుకే వంట మనిషిని కుదుర్చుకునే ప్రయత్నం చేశాడు. కానీ టౌన్‌కి దూరంగా ఉండే ఆ ఒక్క ఇంటి కోసం రావడానికి ఎవరూ దొరకలేదు. చివరి కెలాగో లక్ష్మి దొరికింది. లక్ష్మి సుధాకర్ ఇంటికి దూరంగా ఉండే ఓ కాలనీలో దాదాపు అయిదారు ఇండ్లలో పనిచేస్తుంది. టౌనుకు దూరంగా ఉండే సుధాకర్ ఇంట్లో పనిచేయడానికి మొదట ఆమె కూడా ఒప్పుకోలేదు. కానీ మంచి జీతం ఇవ్వజూపడంతో చివరి కెలాగో ఒప్పుకుంది. మామూలుగా అంద రిళ్లలో పాచి పని మాత్రమే చేస్తున్నా సుధాకర్ ఇంట్లో అన్ని పనులు చేయడానికి ఒప్పుకుంది.



## ప్రకటన పుట్టుక !

ఈ మధ్య వ్యాపార ప్రకటనలు లేని పత్రికలు లేవంటే అతిశయోక్తి కాదేమో ! అసలు వ్యాపార ప్రకటనలు మొదట ఆవిర్భవించింది ఇంగ్లండులో. 1647లో ఇంగ్లాండులోని ఓ పత్రిక ఒక మతాచార్యుడు రాసిన గ్రంథం గురించి ఓ పక్రటన ప్రచురించింది. అదే మొట్టమొదటి ప్రకటన.

సేకరణ: బాలు

*** *** ***

ఉదయం ఎనిమి దవుతున్నా లక్ష్మి జాడలేదు. సుధాకర్ రోజూ తొమ్మిది గంటల కంతా బయల్దేరి ముందు క్యాంటీన్ కెళ్లి టిఫిన్ చేసి ఆఫీస్‌లో అడుగు పెడతాడు. లక్ష్మి ఒప్పందంలో కాఫీ, టిఫిన్ లేవు. రోజు రెండుసార్లు మాత్రం అన్నం, కూరలు చేస్తుంది. ఉదయం చేసిన అన్నం, కూరలను క్యారియర్‌లో ఆఫీస్‌కు తీసుకెళ్తాడు సుధాకర్.

స్నానం చేసి వచ్చి లక్ష్మి కోసం ఎదురుచూస్తూ విసిగేసి రెండోసారి ఫ్లాస్క్‌లోని కాఫీ గ్లాసులోకి వంచుకుని తాగసాగాడు. వంట చేతగాకపోయినా తప్పనిసరై కాఫీ కలపడం మాత్రం నేర్చుకున్నాడు సుధాకర్. కాఫీ తాగడం ముగించేసరికి లక్ష్మి వచ్చింది.

"ఏంటి లక్ష్మీ! ఇంత ఆలస్యం చేశావు?" అసహనంగా ప్రశ్నించాడు సుధాకర్.

"మా పిల్లోడికి ఒంట్లో నలతగా ఉండి ఒకటే సతాయిస్తున్నాడు. వాణ్ని సముదాయించి వచ్చేటప్పటికి కొంత ఆలస్యం అయింది బాబూ!" చెప్పి వంటింట్లోకి వెళ్లి ఫ్లాస్క్‌లోని కాఫీ వంపుకుని తాగసాగింది.

"ఎనిమిదన్నర కావొస్తోంది త్వరగా వంట కానివ్వకూడదూ?" అదే అసహనం అతని గొంతులో.

"చేస్తాను బాబూ ! పొద్దుట్నుంచీ గొంతులో ఏమీ పడలేదు. కాస్త ఈ కాఫీ గొంతులో పోసుకుని పనిలో పడతాను." తాపీగా చెప్పిం దామె.

"రెండు రోజుల నుండి ఇల్లు తుడవలేదు. మాసిన బట్టలు కూడా చాలా ఉన్నాయి..." అని ఇంకా ఏదో అనబోతున్న సుధాకర్ మాటల కడ్డు పడి -

"న న్నేం చేయమంటారు బాబుగారూ! నా కింకా ఆరిళ్లు ఉన్నాయి. నాకు వీలు కాదు అంటే మీరే అప్పుడు బలవంతపెట్టారు. రోజూ ఇంటికెళ్లేప్పటికి చీకటైపోతుంది. నిన్న నా మొగుడు ఇక్కడ పని మానేయమని గొడవ చేశాడు" అంది లక్ష్మి. ఇంతకంటే నే నేమీ చేయలేను అన్నట్టుంది ఆమె ధోరణి. తను మానేస్తే ఇంకొకరు దొరకరనే ధీమా ఆమెలో.

ఇంకేమీ అనలేక నోరు మూసుకుని ఉండిపోయాడు సుధాకర్. ఖచ్చితంగా ఏమైనా చెప్తే ప నెక్కడ మానేస్తుందోనని అతని భయం.

లక్ష్మి కాఫీ తాగి గిన్నెలు తోముతుంటే "నేను కూరలు తరిగితేగాని వంట త్వరగా అవదు" అనుకుంటూ కూరల బుట్ట తీశాడు సుధాకర్. అప్పటికిగానీ గుర్తు రాలే దతనికి. బుట్టలోని చివరి కూరగాయలు నిన్నే అయిపోయని. "అరె! కూరగాయ లేమీ లేవే ఇప్పు డెలా?" అనుకుని లక్ష్మితో "లక్ష్మీ కూరలేమీ లేవు. ఈ రోజు పప్పు వండు" అన్నాడు.

"అయ్యో! పప్పు అయిపోయి నాలుగు రోజు లయింది బాబుగారూ!" చెప్పింది లక్ష్మి.

"ఏంటీ? పప్పు కూడా లేదా. ఇప్పు డెలా? నాలుగు రోజుల క్రితమే అయిపోతే చెప్తే తెచ్చేవాణ్నిగా. తీరా వండే సమయానికి చెప్తే ఎలా? ఇపుడు బజారు కెళ్లి రావాలంటే అరగంట పడుతుంది. ఇప్పు డంత టైం లేదు కదా. ఈ పూటకి కూరెట్లా?" కాస్త కోపంగా అన్నాడు సుధాకర్.

"మొన్నే చెప్దామనుకున్నాను కానీ పనిలో పడి మర్చిపోయాను. నా కెన్ని ఇళ్లు? ఎన్ని పనులు? అయినా కూరగాయ లున్నాయో, లేదో కూడా మీరు చూసుకోకపోతే ఎలా బాబూ? అన్నీ నేనే చూసుకోవాలంటే నాకు కుదరదు కదా!" ఖచ్చితంగానే చెప్పింది లక్ష్మి. అది తన బాధ్యత

కానట్టూ అతని బాధ్యతల్ని గుర్తు చేస్తూ మాట్లాడిందామె.

ఇంకేమీ అనలేక సహనాన్ని తెచ్చుకుని "సరేలే అన్నం వండు. ఈ రోజుకు పచ్చడితో సరిపెట్టుకుంటాలే." నీరసంగా చెప్పాడు సుధాకర్.

లక్ష్మి గబగబా అన్నం వంటి ఇల్లు తుడిచి "బట్టలు సాయంకాలం ఉతుకుతాను నా కింకా ఇళ్లలో పని ఉంది. వెళ్లాలి" అంటూ వెళ్లిపోయింది.

మనసులోని చికాకును అదుపులో పెట్టుకుంటూ అన్యమనస్కంగా తయారై అన్నం, పచ్చడి కలిపి పెట్టిన బాక్స్‌ని బ్యాగ్‌లో పెట్టుకుని, ఇంటికి తాళం పెట్టి స్కూటర్ ఎక్కాడు సుధాకర్. స్కూటర్ మీద వెళ్తూ పని మనిషితో తన పాట్ల గురించి ఆలోచిస్తున్నాడు. "ఎలాగైనా సరే వీలయినంత త్వరలో పెళ్లి చేసుకోవాలి." దృఢంగా నిశ్చయించుకున్నా డతడు.

నిజానికి ఉద్యోగం వచ్చినప్పటి నుండి అతని పెళ్లి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కానీ అతని కమ్మాయి నచ్చితే వాళ్ల నాన్నకు కట్నం నచ్చక, నాన్నకి కట్నం నచ్చితే వాళ్లమ్మకి కానుకలు నచ్చక అతని పెళ్లి ఆలస్యమవుతోంది.

***   ***   ***

కొన్ని నెలల తర్వాత -

ఆ రోజు లక్ష్మి పని ముగించి వెళ్లిపోతూ "బాబుగారూ! ఈ నెల జీతం ఇస్తారాండీ!" అని అడిగింది.

సుధాకర్ డబ్బులు తెచ్చి ఇస్తూ "రేపట్నుంచీ నువ్వు పనిలోకి రానవసరంలేద"ని చెప్పాడు.

"అదేంటి బాబుగారూ! వేరే పనిమనిషిని చూసుకున్నారా?" ఆశ్చర్యంగా అడిగింది లక్ష్మి.

"ఊహూ కాదు రేపు మా ఆవిడ వస్తుంది." చెప్పాడు. కించిత్ గర్వం తొణికిసలాడిం దతని గొంతులో.

"అలాగా బాబుగారూ! అమ్మగా రొస్తున్నారా?" సంతోషంగా అడిగింది లక్ష్మి.

"అవును" ఇక నాకు నీ గోల లేదు అనుకున్నాడు మనసులో.

"అమ్మ గారొస్తే మాత్రమేంటి బాబుగారూ! తనకి కొన్ని పను లలవాటయ్యేదాకా నేను సాయంగా ఉంటాను కదా!" అంది లక్ష్మి.

"అహ, అవసరం లేదు. ఆవిడకి ఇంటి పనులు చేయడం బాగా అలవాటేలే." ఇంక నిన్ను భరించలేను అన్నట్టుంది అతని ధోరణి.

"అలాగే బాబూగారూ! అమ్మ గారొచ్చాకా ఓ సారి చూడడానికి వస్తాను" అంది లక్ష్మి.

"అలాగే చూసి వెళ్లు" అన్నాడు సుధాకర్.

కొంచెం బాధగా వెళ్లిపోయింది లక్ష్మి. మొదట్లో పనికి ఒప్పుకోకపోయినా, తర్వాత అక్కడి పని బాగా నచ్చింది లక్ష్మికి. మంచి జీతం, మంచి యజమాని. అందులోనూ అత డొక్కడే గనుక పెద్దగా పని కూడా ఉండేది కాదాయె.

***   ***   ***

ఆఫీసు వదిలాక అలవాటుగా దాదాపు చాలా మంది క్యాంటీన్ వైపు కదిలారు.

"కాఫీ తాగి వెళ్దాం రాకూడదూ" రాడనీ తెలిసినా యథాలాపంగా అడిగా డో కొలీగ్ సుధాకర్‌ని.

"అతన్ని పిలుస్తావేవిటోయ్. పెళ్లికాకముందే ఆఫీసొదిలాక అరక్షణం ఉండేవాడు కాదు అలాంటి దిప్పుడు పెళ్లయింది" అని మరో కొలీగ్ కామెంట్.

సుధాకర్ కొంచెం సిగ్గుగా నవ్వి "పదండి" అంటూ క్యాంటీన్ వైపు దారి తీశాడు. అందరూ ఆశ్చర్యంగా సుధాకర్ వైపు చూశారు. సుధాకర్‌కు ఒక్క క్షణం ఇంటి దగ్గర ఒంటరిగా తన కోసం ఎదురుచూసే భార్య గుర్తొచ్చింది. అయినా పట్టించుకోకుండా అందరితో పాటు క్యాంటీన్ వైపు కదిలాడు.

రోజు కంటే గంట ఆలస్యంగా ఇంటి కెళ్లాడు సుధాకర్. "హమ్మయ్య! వచ్చేశారా అబ్బా! ఈ రోజు ఇంత లేటయిందేమిటి? ఎదురు చూసీ చూసీ విసిగిపోయాను. ఆఫీస్‌లో వర్క్ ఎక్కువైందా?" అడిగింది వాణి. ఆమె మొహంలో

### బాలీవుడ్ బాత్

#### పాత్రలో లీనమైన బత్రా

'సిసింద్రీ'లో ఒక పాటలో తళుక్కున మెరిసిన ప్రముఖ మోడల్ పూజా బత్రా బాలీవుడ్‌లో నిలదొక్కుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. తన మాజీ ప్రియుడు అక్షయ్‌కుమార్‌కు తా నేమాత్రం తక్కువకాదని నిరూపించడమే తన ఏకైక లక్ష్యమట. ప్రస్తుతం 'బాయీ' అనే చిత్రంలో అక్షయ్ శత్రువు సునీల్‌శెట్టి సరసన బత్రా నటిస్తోంది. హైటెంపరేచర్‌తో బాధపడుతూ కూడా బత్రా ఈ చిత్రంలో నటిస్తోంది. అంతేకాదు, బాలీవుడ్‌లో నిలదొక్కుకోవడానికి తన మిత్రుడు సంజయ్‌కపూర్ గర్ల్ ఫ్రెండ్ అయిన మహీప్ సంధూ సాయంతో బోనీకపూర్‌ను కూడా పట్టేసింది. పూజానా... మజానా...?

మసూద్ అన్సారి

అంతసేపు ఎదురుచూసిన విసుగుపోయి చిరునవ్వు చోటు చేసుకుంది.

"అహ! వర్కేం లేదు ఫ్రెండ్స్‌తో మాట్లాడుతూ ఉండిపోయా!" చెప్పాడు సుధాకర్.

"ఊఁ! నే నిక్కడ ఒంటరిగా విసిగిపోయి మీరు ఎప్పుడు వస్తారా అని ఎదురుచూస్తుంటే మీరేమో ఫ్రెండ్స్‌తో మాట్లాడుతూ ఉండిపోయారా!" నవ్వుతూనే అంది వాణి.

"అఁ, మాట్లాడక ఆఫీస్ అవగానే బుద్ధిగా, భార్యా విధేయుడిలా ఇంటి కొచ్చేయాలా?" వ్యంగ్యంగా అన్నాడు సుధాకర్.

అతని గొంతులో వ్యంగ్యానికి ఆశ్చర్యపోయి.

"ఇందులో భార్యా విధేయే తేముంది? నా భార్య పాపం ఇంట్లో ఒక్కర్తె ఉంటుంది. వెళ్లి కొన్ని ఆమెకు కంపెనీ ఇస్తాను అనుకోవచ్చు కదా! మీ ఫ్రెండ్స్‌తో చెప్పే కబుర్లేవో నాకు చెప్పొచ్చు కదా!" నవ్వుతూనే అంది వాణి. నిజానికి లేటుగ వచ్చాడని ఆమె కేమీ కోపం, బాధా లేవు. అయినా సరదాగా అలా వాదిస్తోంది.

"బోర్ కొడితే టి.వి. చూడు. పుస్తకాలు చదువుకో. అంతేకానీ మొగుణ్ణి కొంగున ముడేసుకోవాలని చూడకు. మగాళ్లన్నాక ఎన్నో వ్యాపకా లుంటాయి" అని సీరియస్‌గా చెప్పిన సుధాకర్ మాటలు వాణికి బాధ కలిగించాయి. అతను కొంత సున్నితంగా చెప్తే బావుండును అనుకుంది. తనింకేమయినా మాట్లాడితే అతను మరింక సీరియస్ అవుతా డేమోననుకుని మాట్లాడకుండా ఊరుకుంది.

***   ***   ***

ఆ రోజు సుధాకర్ ఆఫీస్ నుంచి వచ్చేటప్పటికి ఎక్కడికో వెళ్లడానికి సిద్ధమై గుమ్మం మెట్లు దిగి వస్తోన్న వాణిని చూసి ఆశ్చర్యపోయాడు. అతని ఆశ్చర్యాన్ని పట్టించుకోకుండా "ఏమండీ! ఎదురింటి పిన్నిగారికి ఒంట్లో బాగాలేదు.పాపం ఇంట్లో ఒక్కర్తె ఉంది. ఓసారి పలకరించి వస్తాను" అని గబగబా చెప్పి హడావుడిగా వెళ్లిపోయింది.

అక్కడ ఇండ్లు దూర దూరంగా ఉండటం వల్ల వాణికి ఎవ్వరితోనూ పరిచయం లేదు పెద్దగా. కానీ ఎదురుగా ఉన్న ఇంటావిడతో మాత్రం బాగా పరిచయమయింది.

సుధాకర్ ఇంట్లో కెళ్లి బట్టలు మార్చుకుని మొహం కడుక్కుని వచ్చి ఏదో మాగజైన్ తిరగేస్తూ కూర్చున్నాడు. కాస్సేపటికి మాగజైన్ అక్కడ పడేసి కిటికీ దగ్గర మొక్కల్ని చూస్తూ నిలబడ్డాడు. మళ్లీ విసుగేసి గదిలో అటూ ఇటూ పచార్లు చేయసాగాడు. అతనికి చిరాగ్గా అనిపించింది.

"మంచి కాఫీ తాగుతే బావుణ్ను" మనసులో అనుకున్నాడు.

మనసులోనే భార్యను విసుక్కున్నాడు.

'త నొచ్చాకా కాఫీ ఇచ్చి ఆ తర్వాత వెళ్లొచ్చు కదా' అనుకున్నాడు. అతని విసుగంతా భార్య తనను పట్టించుకోకుండా వెళ్లిందనే. అతని చిరాకు పెరిగింది. దానితోపాటు కాఫీ త్రాగాలనే కోరిక కూడా తీవ్రమైంది. వీధిలోకి చూశాడు. భార్య వస్తోన్న జాడ లేమీ కనిపించలేదు. ఇక లాభం లేదనుకుని చాలా రోజుల తర్వాత వంటింట్లోకి వెళ్లి స్టవ్ అంటించి కాఫీ పెట్టాడు. పాత అలవాటు ప్రకారం రెండు కప్పులు పెట్టాడు. కాఫీ దించి కప్పులో పోసుకుంటుంటే వచ్చింది వాణి.

వస్తూ రాగానే "ఓ! కాఫీ కలపారా. థాంక్యూ" అంది నవ్వుతూ.

వళ్లు మండిపోయింది సుధాకర్‌కు. ఆమె అలా అనకుండా "అరెరె! కాఫీ కలిపారా నే నొచ్చి కలిపేదాన్నికదండీ!" అని నొచ్చుకుంటూ అంటే అతను కొంతైనా సంతృప్తి పడేవాడేమో.

ఆమె మాట వినీ వినిపించుకోనట్టుగా కిటికీ దగ్గర నిలబడి కాఫీ తాగుతూ మొక్కల్ని చూస్తున్నాడు సుధాకర్.


వాణి అతని పక్కనే నిలబడి కబుర్లు చెప్తూ ఓ గుక్క కాఫీ సిప్ చేసి "వాహ్! కాఫీ అద్భుతంగా ఉందండీ" అంది మెరిసే కళ్లతో.

సుధాకర్ ఆమె మాటల్ని పట్టించుకోనట్టూ మౌనంగా ఉండిపోయాడు.

అతని మౌనాన్ని మనసులోని భావాల్ని పట్టించుకోకుండా "ఏమండీ! ఇక నుంచి రోజూ మీరే కాఫీ కలపండీ!" అంది నవ్వుతూ.

# శతావతారాలు

జె. లక్ష్మి



చేప కళ్లపై
కోడిగుడ్డు అద్దాలు!
ఒక చేత సరస్వతి
మరొక చేత లక్ష్మి
మెడలో సమానత్వపు 'రూపు'లు!
జీవితాన్ని భుజాన వేలాడదీసుకుని
కార్యాలయాలకి
రేసుగుర్రాల్లా పరుగులెత్తే రాయంచలు!
బిందెలు మోసే
పిడికెడు నడుములు!
బెండకాయల్లాంటి వేళ్లతో
కత్తితో కుస్తీ పడుతూ
గరిటెతోపాటు ఫైళ్లు తిప్పుతూ
ఊయల ఊపే చేతులతో
విమానాలు నడుపుతూ
ఎండకీ, వానకీ ఒకే గొడుగు పడుతూ
తల వెనుక సమస్యల వలయం
చిటికెన వేలి మీద మాతృ గోళాన్ని నిలిపి
ఇంటా బయటా అవసరమైన అవతారాలెత్తే
శతావతారిక! నేటి మహిళ!!

"అహ! ఇక రోజూ నేనే కాఫీ కలిపితే ఇక తమరేం చేస్తారో" వెటకారంగా అన్నారు సుధాకర్.

అతని నుండి అలాంటి వెటకారాన్ని ఊహించని వాణి బిత్తరపోయింది. ఒక్క క్షణం ఆమెకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

"నేను... నేను... మిగతా పనులు చేస్తున్నాగా..." అంది.

"ఓహో! మీరు పనులన్నీ చేసి అలసిపోతున్నారు కాబట్టి నేను కాఫీ కలపాలా?" ఎంతమాత్రం తగ్గలే దతని వెటకారం.

ఈపాటికి కాస్త తేరుకుంది వాణి. "ఛ.. ఛ.. ఈ మాత్రం పనికి నే నలసిపోయేదేమీ లేదు. నాకు పనెక్కువవుతోందని కాఫీ కలపమనడంలేదు. మీరు కాఫీ బాగా కలిపారు కాబట్టి అన్నా నంతే." స్పష్టంగానే చెప్పింది వాణి.

"నీకు కాఫీ కలపడం బాగా రాకపోతే నేర్చుకో. అంతేకానీ పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడకు. అయినా ఆఫీస్ నుండి అలసిపోయి వచ్చే మొగుడి కింత కాఫీ ఇవ్వాలనే ఇంగితం లేదూ. పైగా నన్నే రోజూ కాఫీ కలపమంటావా?" అతని గొంతు వెటకారం స్థానే కోపం ధ్వనిస్తోంది.

"అదేమిటండీ నే నెప్పుడు మీకు కాఫీ ఇవ్వనట్లు మాట్లాడుతున్నారు. ఈ ఒక్కరోజే కదా మీకు కాఫీ ఇవ్వంది. అదీ పిన్నిగారికి వంట్లో బాగాలేదు కాబట్టి వెళ్లి ఆమె చేత టాబ్లెట్లు మింగించి కాస్త కాఫీ కలిపి తాగించి వచ్చాను." అతను అర్థం చేసుకుంటాడనే ఉద్దేశంతో చాలా శాంతంగా చెప్పింది వాణి.

"ఓహో! ఇంట్లో వాళ్లను పట్టించుకోవడం చేతకాదు కానీ వీధిలో వాళ్లకు మాత్రం సపర్యలు చేయడం బాగా తెలును." అతను మళ్లీ వెటకారంలోకి దిగేసరికి వాణికేం మాట్లాడాలో పాలుపోలేదు. అయినా ఓర్పును కోల్పోకుండా "అదేమిటండీ అలా మాట్లాడుతారు. ఇరుగుపొరుగు అన్నాక ఆ మాత్రం సహాయం చేయకపోతే ఎలా?" అంది వాణి.

"పెద్ద సమాజోద్ధరణకు బయల్దేరావుకానీ ఈ రోజు రాత్రికి నాకు అన్నం పెట్టేదేమైనా ఉందా, లేక ఇలాగే వాదిస్తూ కూర్చుంటావా?" అసహనంగా అన్నాడు సుధాకర్.

ఇక తను ఆ సమయంలో ఏం చెప్పినా పట్టించుకునే స్థితిలో లేడని భావించి లోపలి కెళ్లింది వాణి.

*** *** ***

చపాతీ కోసం పిండి కలుపుతోంది వాణి. తల నొప్పిగా ఉండడం వల్ల రోజులాగా ఉదయాన్నే లేవలేకపోయింది. ఏడున్నర అవుతోంది సమయం. చపాతీ చేయాలి, కూరా చేయాలి. సుధాకర్ క్యారియర్ కోసం భోజనం సిద్ధం చేయాలి. "అమ్మో! ఇవన్నీ ఎప్పుడు చేయాలి" అనుకుంది వాణి. రోజూ చేసే పనే అయినా ఆ రోజు వంట్లో బాగా లేనందువల్ల వంట చేయడం కష్టంగా అనిపించింది. ఇంకాస్సేపయితే "ఇంకా టిఫిన్ చేయలేదా" అని భర్త అడుగుతాడు. అతనికి ఆఫీస్ టైం కూడా అవుతోంది. అందుకే భర్తను సాయం కోరా లనుకుంది.

"ఏమండీ! ఓ సా రిలా వస్తారా" పిలిచిం దామె.

"ఏమిటీ?" పేపర్లోంచి తల తీయకుండానే వంటింట్లో కొచ్చి అడిగాడు.

"ఏమండీ! మీరు కాస్త ఆ బంగాళాదుంపలు తరిగిపెట్టకూడదూ!" అర్థింపుగా అడిగింది.

"ఏమిటీ! నేను కూరలు తరగాలా?" వింతగా చూశాడు సుధాకర్.

"ఈ రోజు టిఫిన్‌కు లేటయిందండీ. నే నీ పిండి సిద్ధం చేసేలోగా మీరు కూరలు తరిగిపెడితే కూరా, చపాతీ త్వరగా చేసేస్తాను కదండీ!" అంది వాణి.

"ఓహో! నువ్వు చేసే ఈపాటి వంటకి ఇంకా నా సాయం కూడా కావాలా?" అని చిరాగ్గా అంటూ "అవునూ నిన్న నేను ఇడ్లీ చేయమన్నానే - నువ్వేమిటి చపాతీ చేస్తున్నావు" అడిగాడు.

"ఇడ్లీ రవ్వ అయిపోయిందండీ. నిన్నే మీకు చెప్దామనుకుని మరిచిపోయాను." నీరసంగా చెప్పింది వాణి.

"మర్చిపోతావులే. అయినా మర్చిపోకుండా ఉండడానికి నువ్వేమైనా ఇంటి బాధ్యతల్ని పట్టించుకుంటేగా?" తగువు పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు మాట్లాడుతున్నాడు సుధాకర్.

"అబ్బా! అదేమిటండీ అలా మాట్లాడుతున్నారు. ఏదో పనిలో పడి చెప్పడం మరిచాను. ఇప్పు డేమయిందీ ఏదో ఓ టిఫిన్ చేస్తున్నాను కదా!" ఆమె గొంతులో కాస్త అసహనం ధ్వనించింది.

"అంటే నువ్వే గడ్డి చేస్తే అదే నేను తినాలి. అంతేకాని నేను కోరింది మాత్రం నువ్వు చెయ్యవు. అంతే కదా!" కోపంగా అన్నాడు సుధాకర్.

"నే నింత కష్టపడి చేసేదానికి మీరు గడ్డి అని పేరు పెడితే నే నేమీ చేయలేను. నాకు బాగా తలనొప్పిగా ఉంది. నేను మీతో వాదించదలచుకోలేదు. మీరు నా కే సాయం చేయొద్దు. నా పని నేను చేసుకోగలను" గుండెల్లోంచి తన్నుకువస్తోన్న దుఃఖాన్ని బలవంతంగా అణుచుకుంటూ సీరియస్‌గా చెప్పి బంగాళదుంపలు తీసుకుని చకచకా ముక్కలు చేయసాగింది.

కానీ అంతటితో ఊరుకుంటే అతను మొగు డెలా అవుతాడు?! ఇంకా ఏమేమో అంటూనే ఉన్నాడు. అవేమీ వినిపించుకోనట్టుగానే టిఫిన్ చేసి అతనికి పెట్టి, తను తినకుండానే గబగబా వంట చేసి అతనికి క్యారియర్‌లో సర్దసాగింది.

ఇంతలో "బాగున్నారా బాబుగారూ! అమ్మగా రున్నారా?" అనే మాటలు వినిపించాయి

కానీ భర్త ప్రవర్తన గురించే ఆలోచిస్తున్న వాణికి ఆ మాట లేమాత్రం ఆసక్తి కలిగించలేదు. యాంత్రికంగా తన పని ముగించి క్యారియర్‌ను బ్యాగ్‌లో పెట్టి సుధాకర్‌కు అందించడం కోసం హాల్లోకి వచ్చింది. అక్కడ నిలబడి ఉన్న ఓ

నడివయస్కురాలిని అనాసక్తిగా చూసింది. భర్త ఆమెతో ఏదో నవ్వుతో మాట్లాడుతున్నాడు.

వాణి అందిస్తోన్న బ్యాగును అందుకుంటూ "వాణీ! ఈవిడ లక్ష్మి. నువ్వు రాకముందు... ఐ మీన్... మన పెళ్లి కాకముందు నా పనిమనిషి" అంటూ పరిచయం చేశాడు సుధాకర్.

అతడు పరిచయం చేసిన తీరును చూసి "బహుశా నన్ను 'నీ స్థానంలో వచ్చిన పనిమనిషి' అంటూ పరిచయం చేస్తాడేమో" అనుకుంటూ లక్ష్మి వైపు చిరునవ్వు నవ్వింది.

"అమ్మగారు చాలా బావున్నారు బాబుగారు!" అన్న లక్ష్మి మాటలకు ఒక్క క్షణం గర్వంగా చిరునవ్వు నవ్వి "నాకు ఆఫీస్ టైం అయిపోతోంది. వెళ్తున్నాను మీ రిద్దరూ మాట్లాడుకోండి" అని చెప్పి వెళ్లిపోయాడు సుధాకర్.

వాణి, లక్ష్మి ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. వాణి కేం మాట్లాడాలో తోచలేదు. లక్ష్మి మాట్లాడింది. "నేను రోజూ అనుకుంటున్నాను అమ్మగారూ! మిమ్మల్ని చూడడానికి రావాలని కానీ కుదిరిచావడలేదు. నేను పనిచేసే రెండిళ్ల వాళ్లు ఊరెళ్లారు. మిగతా ఇళ్లల్లో గబగబా పని ముగించుకుని ఇటు వచ్చాను" అంది లక్ష్మి.

అప్పటికీ ఏం మాట్లాడాలో తోచలేదు వాణికి. "మీరు కూర్చోండమ్మా నే నిప్పుడే వస్తాను" అంటూ వంటింటి కేసి నడిచింది లక్ష్మి. లక్ష్మి కూర్చోకుండా వాణి వెనకాలే చొరవగా వంటింట్లో కొచ్చింది. వాణి టేబుల్ మీద ఉన్న ఎంగిలి కప్పులు, ప్లేట్లు వగైరాలన్నీ తీసి సింక్ దగ్గర పడేస్తుంటే లక్ష్మి గబగబా తోమసాగింది.

"అరెరె! నేను తోముకుంటాను" అన్న వాణి మాటలను మధ్యలోనే అడ్డుకుని "ఫర్వాలేదు లేమ్మా నా కిదేమయినా కష్టమైన పనా!" అంటూ చకచకా తోమేసింది.

సుధాకర్ తినగా మిగిలిన చపాతీలను ప్లేట్లో పెట్టి తినమంటూ లక్ష్మి కిచ్చింది వాణి. ప్లేటు అందుకుని తింటూ వాణిని అన్ని వివరాలు అడగసాగింది లక్ష్మి. వాణి తల్లిదండ్రుల గురించి, అన్నదమ్ముల గురించి అక్కా చెల్లెళ్ల గురించి లక్ష్మి ఆప్యాయంగా అడుగుతుంటే ఓపికగా సమాధానాలు చెప్పసాగింది.

కొత్త కాపురం గురించి ఏవో ప్రశ్నలడిగి సుధాకర్ ప్రస్తావన తెస్తూ "బాబుగారు చాలా మంచోరమ్మా. నేను రెండేళ్లు పని చేశాను. కానీ ఏనాడూ బాబుగారు కోపం తెచ్చుకోవడం చూడలేదు నేను. నన్ను ఏనాడూ పల్లెత్తుమాట అనలేదు. బాబుగారు ఆఫీసు నుంచి ఆలస్యంగా వస్తే 'నేను త్వరగా వెళ్లాలంటూ' రుసరుసలాడేదాన్ని. ఇంకా రోజు సగం పని పాపం ఆయనే చేసేవారు" అంటూ ఫక్కున నవ్వింది లక్ష్మి.

ఆమె మాటలు వింటూ ఉందేగానీ ఏమీ మాట్లాడలేదు వాణి.

మళ్లీ లక్ష్మిమాట్లాడుతూ "పని మనిషితోనే అంత బాగా ఉన్నవారు ఇంక భార్యను ఎంత బాగా చూసుకుంటారో కదా..." అని అంటున్న లక్ష్మి మాటలకు అడ్డుపడి "ఏం! పనిమనిషిని బాగా చూసుకుంటే మాత్రం భార్యను కూడా బాగా చూసుకోవాలని ఉందా?" పెదాల మీదకు బలవంతంగా నవ్వు తెచ్చుకుంటూ అడిగింది వాణి.

"అదేంటమ్మా! అలా అంటారు? పనిమనిషినే బాగా చూసుకున్నవాడు భార్యను మాత్రం ఎందుకు బాగా చూసుకోడమ్మా?" ఆశ్చర్యంగా అంది లక్ష్మి.

"పనిమనిషిని బాగా చూసుకోకపోతే పని మానేస్తుంది. కానీ భార్యను బాగా చూసుకోకపోతే భార్యేమీ పని మానదుగా. అందుకని భార్యను బాగా చూసుకునే అవసరం లేదు." ఏడ్వలేక నవ్వుతూ చెప్పింది వాణి.

"అదేంటమ్మా అలా మాట్లాడుతున్నారు?" అనుమానంగా వాణి కళ్లల్లోకి చూసింది లక్ష్మి.

"అహ! ఊరికే సరదాకు మాట్లాడాను" అంటూ చూపులు తిప్పుకుని "ఉండు కాఫీ కలుపుతాను" అంటూ స్టవ్ వైపు కదిలింది.

"కాఫీ అంటే గుర్తొచ్చిందమ్మా. అయ్యగారి చేతి కాఫీ అద్భుతంగా ఉంటుందమ్మా. రెండేళ్లు అయ్యగారి చేతి కాఫీ తాగానమ్మా" అంది లక్ష్మి.

"అదృష్టవంతురాలివి" మనసులోనే అనుకుంది వాణి. ఆ రోజు సుధాకర్ చేతి కాఫీ తాగిన తర్వాత జరిగిన చేదు సంఘటన గుర్తొచ్చిందామెకు.

వాణి ఇచ్చిన కాఫీ తాగి ఇంకాస్సేపు కబుర్లు చెప్పి 'వస్తా'నంటూ సెలవు తీసుకుంది లక్ష్మి.

లక్ష్మి వెళ్లిన వైపే చూస్తూ అలాగే ఉండిపోయింది వాణి. "ఇన్నాళ్లు నేను భార్యంటే పనిమనిషి లాంటి దనుకున్నాను. కానీ పనిమనిషికి జీతమూ, రాయితీలు, హక్కులు ఉంటాయి. కానీ భార్యకు అవేమీ ఉండవు సరికదా బాధ్యతలు మాత్రం ఉంటాయి...." అనుకుంది భారంగా వాణి. ◆

---



# కేశోపాఖ్యానం

దొరికినది వెంట్రుకయినా దానినిబట్టి అది ఆడవారిదా? మగవారిదా? ఏ వయసు వారిది? వంటి విషయాలు చెప్పవచ్చు. మనుషుల ముఖాలు ఒకరికి మరొకరికి ఏ విధంగా తేడా కలిగి ఉంటాయో అదే విధంగా మనిషి మనిషికి వెంట్రుకలు తేడాగా ఉంటాయి. మనిషి మరణిస్తే శరీర భాగాలన్నీ నశిస్తాయి కాని వెంట్రుకలు అలాగే ఉంటాయి.

మనిషి మరణించిన తరువాత కూడా ఇవి స్వల్పంగా పెరుగుతాయి.

వెంట్రుకలకు రంగు, బలం ఇచ్చే పదార్థాలు రోమ కూపాలలోకి శరీరం నుండి సరఫరా అవుతుంది. ఈ కుదుళ్లకు నష్టం కలిగితే నెత్తి మీద వెంట్రుకలు పల్చబడడం, రాలిపోవడం జరుగుతుంది.

వెంట్రుక ఆధారంగా నేరస్థుడిని కనిపెట్టగలమని లేదా పట్టుబడ్డ వ్యక్తి దోషి లేదా నిర్దోషి అని నిర్ణయించగలమని ఫోరెన్సిక్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికి లేసర్ మాస్ స్పెక్ట్రోస్కోపీ సహాయపడుతుందని వివరిస్తున్నారు.

మనిషికి పిచ్చి కోపం వస్తే జుట్టు పీక్కుంటాడు. వైద్యశాస్త్రంలో ఈ వ్యాధిని 'ట్రైకోటిలోమానియా' అంటారు. ఒత్తిడి ప్రభావంగా వచ్చే ఈ రోగానికి మానసికపరమైన చికిత్స చేయాలని వైద్య నిపుణుల అభిప్రాయం.

ఎండలో తిరిగితే చర్మం ముడతలు పడి, నల్లగా తయారవుతుంది. దీనికి విరుగుడుగా మానవ శరీరంలో తయారయ్యే సహజసిద్ధమైన రంగు రోమ కుదుళ్లలో లభించే 'మెలానిన్'తో కొత్త రకం లోషన్ తయారు చేశారు. ఈ లోషన్ రాసుకుంటే ఎండవల్ల చర్మానికి ఎటువంటి చికాకు ఉండదు.

అసలు మనిషి వెంట్రుకనుబట్టి ఆ మనిషి హింసా ప్రవృత్తిని గుర్తించవచ్చునని టెక్సాస్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ ఒకాయన చెపుతున్నాడు. వెంట్రుక ప్రోటీన్‌తో తయారయినా అందులో రకరకాల లోహాలు, ఖనిజాలు కూడా ఉంటాయి. వెంట్రుకలో ఉండే వీటి నిష్పత్తినిబట్టి ఆ వ్యక్తి శరీరంలో ఇవి ఏ నిష్పత్తిలో ఉన్నాయో అంచనా వేయవచ్చు. దానినిబట్టి మెదడులో జరిగే రసాయన చర్యలు — ప్రతిచర్యలు విశ్లేషించి మనిషి ప్రవర్తనను ముందుగానే గుర్తించవచ్చునని ఈ ప్రొఫెసర్ వాదన.

జుట్టు నెరుస్తూంటే దిగాలుపడిపోయే ప్రజానీకం వయసు బయటపడకుండా ఉండేందుకు జుట్టుకు రంగు వేసుకుంటూ ఉంటారు. జుట్టుకు రంగు వేయడం తప్పుకాదుగాని అన్ని రకాల రంగులు మంచివికావని గుర్తుంచుకోవాలి. కొన్ని రకాల రంగులు వాడితే జుట్టు మాట అటుంచి వారి చర్మం పాడవుతుంది.

ఈ రంగు వల్ల చర్మానికి ఎలర్జీ వచ్చి దురద, వాపు, మంట మొదలవుతాయి. వాడకందారులే ఈ రంగుల గురించి నిర్ణయించుకోవాలి. ముందు రంగును చర్మానికి కొద్దిగా రాసుకుని రియాక్షన్ ఏమిటో తెలుసుకుని ఆపైన దానిని వాడుకోవడమా, మానుకోవడమా తేల్చుకోవాలి. మనిషికి కొత్త అందాన్ని తెచ్చి పెట్టే కేశాలు ఎన్నో పనులు చేయడానికి వినియోగపడడం గమనించతగిన విషయం.

సి.వి.సర్వేశ్వర శర్మ